

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ యాదవ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 274 | ది. 9-1-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 274 | Date : 9-1-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


## డ్వాక్రాతో మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశాం

### గుంటూరులో సరస్ మేళా 2026ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- సొంతకాళ్లపై ఆడబిడ్డలు నిలబడాలనే డ్వాక్రా స్థాపన
- మహిళలతో టీడీపీకి ప్రత్యేక అనుబంధం
- వారి కష్టాలు చూసే దీపం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం
- సంజీవనితో ఐదు కోట్ల ప్రజల ఆరోగ్యానికి భరోసా





**గుంటూరు,జనవరి 8 (వార్తాప్రభ) :** మహిళల ఆర్థిక ప్రగతి కోసం తాను స్థాపించిన డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సీఎం చంద్రబాబు అన్నారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. గుంటూరులో సరస్ మేళా 2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...డ్వాక్రా సంఘాలను చూస్తే నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. మహిళలు ఆర్థికంగా వారి కాళ్లపై సొంతగా నిలబడాలనే ఉద్దేశంతో నేను 30 ఏళ్ల క్రితం డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చాను. ఆనాడు డ్వాక్రా మహిళలు మీటింగుల కోసం బయటకు వస్తే ఎంతోమంది ఎగతాళి చేశారు. కానీ నేడు డ్వాక్రా సంఘులు తిరుగులేని వ్యవస్థగా దేశంలోనే రికార్డు సృష్టించాయి. డ్వాక్రా, మెప్మా సంఘాలు నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. రాష్ట్రంలో కోటీ 13 లక్షలమంది డ్వాక్రా మహిళలు రూ. 26 వేల కోట్ల నిధిని, రూ. 5,200 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం. 2024-25లో డ్వాక్రా సంఘాలు రూ. 46,590 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాన్ని మన రాష్ట్రంలోనూ ఏర్పాటు చేసిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను అభినందిస్తున్నాను. ఈ ఎక్స్‌పోను చూస్తుంటే మినీ ఇండియాను తలపిస్తోంది. అంతటా పండుగ వాతావరణం నెలకొంది. సరస్ మేళా సంప్రదాయ హస్తకళలు, హ్యాండ్లూమ్స్, స్థానిక ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్ తీసుకురావడంతో పాటు మార్కెట్ లింకేజీ సదుపాయాన్ని కల్పిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

**ఆడబిడ్డలతో ప్రత్యేక అనుబంధం..** ఆడబిడ్డలతో తెలుగుదేశం పార్టీ అనుబంధం ఈ నాటికి కాదు. ఆనాడు ఎన్టీఆర్ మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారు. మహిళల కోసం తిరుపతిలో పద్మావతీ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. నేను ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా సంఘాల ద్వారా మహిళకు ఆర్థిక భరోసా కల్పించాను. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల్లో 89 లక్షలమంది, మెప్మా సంఘాల్లో 24 లక్షల మంది సభ్యులున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మరిన్ని రుణాలు ఇస్తాయని నేను చెప్పిన మాటను పొదుపు మహిళలు తూచా తప్పకుండా పాటించి ఆర్థిక ప్రగతి సాధించారు. 2024-25లో రూ. 46 వేల 590 కోట్ల రూపాయి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. నేనిచ్చిన ఐటీ పిలుపుతో ఎంతోమంది దేశ విదేశాల్లో ఆర్థికంగా ఉన్నతంగా స్థిరపడ్డారు. ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 93 వేలమంది మైక్రో, ఎంఎస్ ఎంఈ ఎంట్రప్రెన్యూర్లు అయ్యారు. డ్వాక్రా మహిళలు విదేశాలు కూడా వెళ్లి ఎంతోమందికి ట్రైనింగ్ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలను మరింత సమర్థవంతంగా తయారుచేసే బాధ్యత నాదని సీఎం చంద్రబాబు అన్నారు.

**ముఖ్యమంత్రి అంటే పెత్తందారు కాదు..** ముఖ్యమంత్రి అంటే పెత్తందారు కాదు. ప్రజా సేవకుడు. కూటమి ప్రభుత్వం సంక్షమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోంది. తల్లికి వందనం కింద ఏడాదికి రూ.10,090 కోట్లు 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం స్త్రీ శక్తి పథకం తీసుకువచ్చాం. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితంగా అందిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సంజీవని కార్యక్రమం ద్వారా ఐదు కోట్ల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం. పేదరికం లేని రాష్ట్రం లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అంతకుముందు స్త్రీ నిధి పథకం కింద డ్వాక్రా సంఘాలకు రుణంగా రూ.1,375 కోట్ల చెక్కును సీఎం అందించారు. సెర్ప్ నుంచి రూ.2171 కోట్లను పొదుపు సంఘాలకు రుణంగా అందించారు. చేనేత వస్త్ర స్టాళ్లను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి తన సతీమణి భువనేశ్వరికి చీరను కొనుగోలు చేశారు. భర్తకు ఆరోగ్యం బాగోలేదని తన దృష్టికి తీసుకొచ్చిన పొదుపు మహిళకు సీఎం సహాయ నిధి నుంచి రూ.6 లక్షలు ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారు.

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున రావుకు ఘన వీడ్కోలు









**అమరావతి,జనవరి 8 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా సేవలు అందించిన జస్టిస్ టి.మల్లికార్జునరావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు పలికారు.జస్టిస్ మల్లికార్జున రావు ఈనెల 18న పదవీ విరమణ చేయనున్న నేపధ్యంలో హై కోర్టు మొదటి కోర్టు హాల్ లో గురువారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ మల్లికార్జునరావు కష్టించి పనిచేసి ఉన్నత శిఖరాలకు చేరారన్నారు.1964లో జన్మించిన జస్టిస్ మల్లిఖార్జున రావు 1988లో అమలాపురం బార్ కౌన్సిల్ సభ్యుడిగా నమోదై 6 సంవత్సరాల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారన్నారు.పేదలకు తన సేవలను అందించడంలో మల్లికార్జునరావు ఆసక్తి చూపేవారని దీంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.1994లో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారని వివరించారు. తదుపరి 2007లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి,2015లో జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారన్నారు.2022లో హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారన్నారు.హై కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మల్లికార్జున రావు అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు.జస్టిస్ మల్లికార్జునరావు తక్కువ సమయంలోనే ఎక్కువ కేసులను పరిష్కరించి తమ సమర్థతను చాటుకున్నారని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు.అంతేగాక ఉద్యోగ నిర్వహణలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా అత్యంత సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వహించిన జస్టిస్ మల్లికార్జున రావు అందరికీ ఆదర్శనీయంగా నిలిచారన్నారు.పదవీ విరమణ అనంతరం జస్టిస్ మల్లికార్జున రావు శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని కోరుకుంటున్నామని హై కోర్టు ప్రధాన న్యాయమర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆకాంక్షంచారు. జస్టిస్ మల్లికార్జునరావు మాట్లాడుతూ తన ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు.న్యాయమూర్తిగా రాగ ద్వేషాలకు అతీతంగా ఉద్యోగ నిర్వహణ చేయాలని జడ్జి ట్రైనింగ్ సమయంలోనే నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. తనది వ్యవసాయాధారిత కుటుంబం అయినా ఒక న్యాయవాదిగా, న్యాయమూర్తిగా సేవలను అందించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ యాక్టింగ్ ప్రసిడెంట్ కేవీ రఘువీర్ లు జస్టిస్ మల్లికార్జునరావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.ఇంకా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు జస్టిస్ మల్లికార్జున రావుకు అభినందనలు తెలిపారు.ఈకార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు,రిజిస్ట్రార్ జనరల్,రిజిస్ట్రార్లు,బార్ కౌన్సిల్,బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార శాఖకు నూతన వీడియో కెమెరాలు.. అందచేసిన చేసిన మంత్రి పార్థసారథి



**అమరావతి,జనవరి 8 (వార్తాప్రభ) :** సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార శాఖ ఉద్యోగులు పనిచేయాలని సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖామాత్యులు శ్రీ కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో సమాచార శాఖకు నూతన వీడియో కెమెరాలను మంత్రి పార్థసారథి గురువారం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సమాచార శాఖ ఉద్యోగులు నాణ్యమైన ప్రచారాలు చేయడానికి అవసరమైన అత్యాధునిక వీడియో కెమెరాలను అందించడం జరిగిందని, సాంకేతికంగా అత్యుత్తమ క్వాలిటీ ప్రచారాలు అందించేందుకు ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టెక్నలజీలో వేగంగా మార్పులు వస్తున్నాయని, ఆ వేగాన్ని అందిపుచ్చుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందుకనే సిబ్బందికి సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా అత్యాధునికమైన కెమెరాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఉన్న కెమెరాలకు అదనంగా ఇప్పుడు కొత్తగా కొనుగోలు చేసిన కెమెరాలతో మంత్రుల పర్యటనలు, జిల్లా కలెక్టర్ల పర్యటనలు, వీవీఐపీ, విఐపీ పర్యటనలు కవరేజికి వినియోగించుకోవాలన్నారు. 20 సోనీ పీఎక్స్ డబ్ల్యు జడ్ 90 వి కెమెరాలను అధికారులకు మంత్రి చేతుల మీదుగా అందచేశారు. అతి త్వరలోనే అవసరమైన కంప్యూటర్ లు, 4 జి కిట్లను కూడా సమాచార శాఖకు సమకూర్చనున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సమాచార శాఖ డైరక్టర్ కె. ఎస్. విశ్వనాథన్, తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర సమాచార,హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ కొలుసు పెదరెడ్డయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులందరూ కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన చిత్రాలు
-పామర్రు,జనవరి 8 (వార్తాప్రభ) :



## 'వార్తాప్రభ' కథనానికి అదిరిపోయే రెస్పాన్స్

## రాజీవ్ గృహకల్ప పార్కులో మొదలైన ప్రక్షాళన!

- రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ యంత్రాంగం: చెత్త తొలగింపు పనులు షురూ..
- పార్కుల సుందరీకరణకు రూ. 3 కోట్లు మంజూరు; వాకింగ్ ట్రాక్, బెంచీల ఏర్పాటుకు నిర్ణయం!
- అడుగడుగునా సీసీ కెమెరాలు: చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక!


వార్తాప్రభ
నరకప్రాయంగా రాజీవ్ గృహకల్ప పార్కు



**జగద్గిరిగుట్ట, జనవరి 8 (వార్తాప్రభ) :** జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని పార్కుల దుస్థితిపై 'వార్తాప్రభ' దినపత్రికలో ప్రచురితమైన కథనం అధికారుల్లో భారీ చలనం తెచ్చింది. "నరకప్రాయంగా రాజీవ్ గృహకల్ప పార్కు" శీర్షికన పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం, భవన నిర్మాణ వ్యర్థాలపై వచ్చిన వార్తకు జీహెచ్ఎంసీ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించింది.

**సమరశంఖం పూరించిన అధికారులు - ప్రక్షళన పనులు ప్రారంభం:** వార్త ప్రచురితమైన వెంటనే గాజులరామారం సర్కిల్ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం ఉదయం నుండే చెత్త సేకరణ వాహనాలతో పార్కులో పేరుకుపోయిన టన్నుల కొద్దీ భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. అడవిలా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తూ, ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్నారు.

**రూ. 3 కోట్లతో కార్పొరేట్ లుక్: పార్కులో లభించనున్న వసతులు..** కేవలం చెత్త తొలగింపుతోనే ఆగకుండా, గాజులరామారం సర్కిల్ పరిధిలోని పార్కులను ఆధునీకరించేందుకు రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేశారు. రాజీవ్ గృహకల్ప పార్కులను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికుల కోసం అధునాతన వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పచ్చదనం పార్కు అంతటా పచ్చని గడ్డి మరియు అడుగడుగునా నీడనిచ్చే మొక్కలు నాటడం. వృద్ధులు, మహిళలు కూర్చోవడానికి సౌకర్యవంతమైన బల్లల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**నిఘా నీడలో పార్కు.. చెత్త వేస్తే కఠిన చర్యలు!..** పార్కును మళ్ళీ డంపింగ్ యార్డ్‌గా మార్చకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పార్కు ఆవరణలో అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పటిష్టమైన నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి పార్కులో చెత్త వేసినా లేదా భవన వ్యర్థాలను పడేసినా కెమెరా దృశ్యాల ఆధారంగా వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యను వెలుగులోకి తెచ్చి, అధికారులు చేత పనులు ప్రారంభించేలా చేసిన 'వార్తాప్రభ' పత్రికకు రాజీవ్ గృహకల్పవాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నిధుల మంజూరు మరియు సీసీ కెమెరాల ఏర్పాటుతో పార్కుకు శాశ్వత విముక్తి లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

వార్తాప్రభ ఎఫెక్ట్: సమస్య వెలుగులోకి రావడమే కాదు.. పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షన నిలబడుతుంది!











## పవన్ రాక సందర్భంగా మద్యం ధరల పెంపు...?

● ఎక్సైజ్ అధికారుల తీరును ఛీ కొడుతున్న మద్యం ప్రియులు



**కాకినాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా ఆయనకు చెడ్డ పేరు తీసుకొచ్చేందుకు కాకినాడ ఎక్సైజ్ శాఖ విశేష కృషి చేస్తోందా... అన్నట్టుగా అందుకు అనుగుణంగా మద్యం ధరలు పెంచి పవన్ రాకకు స్వాగతం పలుకుతోంది.సంక్రాంతి సంబరాలు పేరిట పిఠాపురంలో ప్రారంభోత్సవాన్ని ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మద్యం ధరలు బాటిల్ పైన 10 నుంచి 20 రూపాయల వరకు పెంచి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దుకాణా దారులు అధిక ధరలకు విక్రయించేందుకు పూర్తిస్థాయి అనుమతులు ఇచ్చారనే ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైతేనో పవన్ పిఠాపురం రాక సందర్భంగా మద్యం దుకాణాల దారులు, ఎక్సైజ్ అధికారులు కలిసి భారీగా దోపిడీ చేసి దండుకుంటున్నారని, కాకినాడ జిల్లా ఎక్సైజ్ అధికారుల తీరును మద్యం ప్రియులు ఛీ కొడుతున్నా దున్నపోతు మీద వాన చందంగా జిల్లా ఎక్సైజ్ అధికారుల తీరు ఎన్నో ఎన్నెన్నో అనుమానాలకు తావిస్తుంది.దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మద్యం వ్యాపారులకు అండగా నిలిచిన ఎక్సైజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని మద్యం వ్యాపారులు దోపిడీకి అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## లైంగిక సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

### ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జి.సమరం




**విజయవాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** "ఆరోగ్యకరమైన లైంగిక జీవితం వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, దాంపత్య బంధాన్ని బలపరుస్తుంది. లైంగిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మానసిక అనారోగ్యానికి, కుటుంబ కలహాలకు దారితీస్తాయి. లైంగిక ఆరోగ్యంపై అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం" అని ప్రముఖ వైద్యులు డా?సమరం పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్ డి. రవికుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన "లైంగిక సమస్యలు " అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ లైంగిక ఆరోగ్యం మనిషి సంపూర్ణ ఆరోగ్యంలో ఒక ముఖ్యమైన భాగమన్నారు. అవగాహన లేమితో స్త్రీలు, పురుషులు రకరకాల లైంగిక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సిగ్గు, భయం, జంకుతో వైద్యుడిని సంప్రదించడంలో అలస్యం చేస్తూ సమస్యలను తీవ్రతరం చేసుకుంటున్నారని అన్నారు. స్ట్రెస్, యాంగ్జైటీ, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు, మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, హార్మోన్ల లోపం వంటి శారీరక సమస్యలు, జీవనశైలిలో మార్పులు లైంగిక సమస్యలకు ప్రధాన కారణాలన్నారు. లైంగిక సమస్యల్లో అంగస్తంభన వైఫల్యాలు, త్వరితంగా వీర్యస్ఖలనం అవడం, సెక్సు కోరికలు లేకపోవడం పురుషుల్లో ప్రధానమైనవి కాగా, స్త్రీలల్లో సెక్సుపై ఆసక్తి లేకపోవడం, రతి సమయంలో నొప్పి, యోని పొడిగా ఉండటం ముఖ్యమైనవి అన్నారు. లైంగిక సఖ్యత లేనివారిలో దాంపత్య సంబంధాలలో కలతలు, వంధ్యత్వ సమస్యలు, ఆత్మవిశ్వాసం లోపించడం, ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలు ఏర్పడతాయన్నారు. శారీరక ఆరోగ్యమే కాదు మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండటం లైంగిక ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమన్నారు. లైంగిక సమస్యలు సాధారణమైనవని, పూర్తిగా చికిత్స చేయగలిగిన వేనని అన్నారు. లైంగిక సమస్యలకు గురైనవారు సిగ్గుపడకుండా, అలస్యం చేయకుండా సరైన వైద్యులని సంప్రదించి చికిత్స పొందితే ఆరోగ్యకరమైన కుటుంబ జీవితం వారి సొంతం అన్నారు. సదస్సులో పాల్గొన్న అనేకమంది పలు ప్రశ్నలడిగి సందేహ నివృత్తి చేసుకున్నారు.

## రహదారి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**తిరువూరు,జనవరి 8 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం అక్క పాలెం గ్రామం వెళ్లే ప్రధాన రహదారి గత పది సంవత్సరాలుగా రోడ్డు పాడైపోయి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులకు రాత్రి వేళల్లో ప్రాణ సంకటంగా మారింది ఎంతో మంది వాహనాలు గుంటల్లో పడి ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరిగి ఆసుపత్రుల పాలై నరకయాతన అనుభవించారు ఎట్టకేలకు తిరువూరు నుండి అక్కపాలెం వెళ్లే రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్డుకు డబ్బులు మంజూరు చేయటంతో ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు పార్టీ నాయకులు కార్య కర్తలు ఆర్ అండ్ బి అధికారులతో కలిసి రోడ్డుకు శంకుస్థాపన చేసి రోడ్డు పనులు ప్రారంభించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లు త్వరలోనే పనుల ప్రారంభం జరుగుతాయి ముఖ్యంగా పట్టణంలో బస్టాండ్ నుండి తోక పల్లి వెళ్లే రోడ్డుకు రేపు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు తిరువూరు నియోజకవర్గానికి రోడ్ల కొరకు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి వర్యులు కృతజ్ఞతలు తెలియజేశారు

## కెవిఆర్ సిగ లో మరి ఒక కలికితురాయి



**విస్సన్నపేట,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక కె.వి.ఆర్ ఒకేషనల్ అండ్ జూనియర్ కాలేజీ తో పాటు కెవిఆర్ విద్యాసంస్థల జాబితాలోకి గౌరవాన్ని ఇనుమడింపజేసే దిశలో భాగంగా కె.వి.ఆర్ మహిళా కళాశాల కె.వి.ఆర్ జాబితాలో కలికితురాయిగా చేరినట్లు అయిందని సర్వత్రా అనుకుంటున్నారు. 20 26 విద్యా సంవత్సరం నుండి ఎంపీసీ,బైపిసి, ఎం బి పి సి సీఈసీ కోర్సులతోపాటు ఐఐటి ఎంసెట్ నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వటం జరుగుతుందని కె వి ఆర్ విద్యాసంస్థల అధినేత కే వెంకటేశ్వరరావు మీడియాకు తెలియజేశారు. బస్సు సౌకర్యంతో పాటు ఆడపడుచులకు ప్రత్యేక క్యాంపస్ ఉండటం మరి ఒక సౌకర్యంగా ఉంటుందని అది ఒక భరోసా అని విద్యార్థుల తల్లిదండ్రులు నోట వినిపిస్తుంది.

## 'శ్రీ అగస్త్య'లో ఆనందోత్సాహాల నడుమ ఫుడ్ ఫెస్టివల్





**కాకినాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** నిత్యం చదువులతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆహ్లాదం పంచేందుకు గాను గురువారం ఉదయం స్థానిక శాంతినగర్ లో గల శ్రీ అగస్త్య స్కూల్ వశిష్ట క్యాంపస్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శ్రీ అగస్త్య విద్యాసంస్థల కరస్పాండెంట్ డి.నాగేశ్వర రావు (డిఎన్ఆర్) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కౌస్తుభ హెూటల్ మేనేజర్ యు. రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఫుడ్ ఫెస్టివల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీ అగస్త్య పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు పిల్లలను ఉత్తేజపరిచేలా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇక్కడి ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను చూస్తే తన చిన్ననాటి రోజులు గుర్తుకువస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ డి. నాగేశ్వరరావు (డిఎన్ఆర్) మాట్లాడుతూ సంక్రాంతి వేడుకలు శ్రీ అగస్త్యలో ముందుగానే వచ్చాయన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో వంటలకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని, దానిలో భాగంగా మన విద్యార్థులకు తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేలా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఫుడ్ ఫెస్టివల్ ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగి భాస్కర్, శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డి.పల్లవి, జోనల్ ప్రిన్సిపాల్ సురేష్, క్యాంపస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి , అకౌంటెంట్ అల్లుమల్లు ఏలియా, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వరమిచ్చిన తిరువూరు నియోజకవర్గ శ్రీనివాసుడు



**విస్సన్నపేట,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో పద్మశాలి సామాజిక వర్గ కుటుంబాలు అత్యధికంగా నివసించే ప్రాంతం పద్మశాలి స్ట్రీట్ లోని శ్రీ పద్మావతి సమేత భావన ఋషి స్వామి వారి ఆలయం ప్రాంత రహదారి విషయమై పద్మశాలి సామాజిక వర్గ పెద్దలు తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావును కలవడం జరిగింది. ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మురుగుల ప్రసాద్ తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి, పద్మశాలి సంఘశీ అధ్యక్షులు గుద్దల రాంబాబు, కార్యదర్శి పర్వతం సత్యనారాయణ పెండెం రామకృష్ణ తదితర పెద్దలు శాసనసభ్యునికి పట్టు శాలువాతో ఘన సన్మానం నిర్వహించారు. వంద సంవత్సరాలకు పైగా శ్రీ పద్మావతి సమేత భావన ఋషి స్వామి వారి కళ్యాణాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. మూడు, నాలుగు వార్డులకు సంబంధించి సుదీర్ఘకాలంగా రహదారి దెబ్బతిన్న విషయాన్ని ఎమ్మెల్యే కు విన్నవించగా పండుగ (25వ తేదీ) నాటికి శాసనసభ్యుడు సొంత నిధులతోనైనా రహదారి పూర్తి చేయించి ఇస్తానని హామీ ఇవ్వడంతో పద్మశాలి సామాజిక వర్గ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెండెం నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ దునకా సత్యనారాయణ, గుద్దల శ్రీనివాసరావు,పెండెం భవన్నారాయణ, చెరుకు వెంకటముత్యం, సంబారు వెంకట ముత్యం, గుద్దల చెన్నారావు, పెండెం భావన ఋషి, వెంగళ బ్రదర్స్, పర్వతం రామకృష్ణ లక్ష్మణరావు వీరితో పాటు కలగర టిడిపి నాయకులు గరిమెళ్ళ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

## ముగిసిన ఐ సి టి సైబర్ సెక్యూరిటీ సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ





**విస్సన్నపేట,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక వికాస్ డిగ్రీ కళాశాల నందు ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేట్ కోర్సుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 65 మంది డిగ్రీ విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన ఆధునిక అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సి రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీకి ఉన్న ప్రాధా న్యతను సమగ్రంగా వివరించారు. ప్రతి ఒక్కరూ తమ నైపుణ్యాలను పెంపొందించి భవిష్యత్ ఉద్యోగావకాశాలకు బంగారు బాటలు వేసుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అకాడమీ ట్రైనర్ ఉమైర్ అహ్మద్ సమర్థవంతంగా నిర్వహించి సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రాయోగ అంశాలు రియల్‌టైమ్ ఉదాహరణలతో విద్యార్థులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో వికాస్ డైరెక్టర్ ఎన్ వేమన నర్సిరెడ్డి ఆర్ కొండల రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్ రెడ్డి, పీజీ కళాశాల పి. వినోద్ హాస్టల్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సీతారామరాజు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిప్ కి ఎంపికైన ఆదిత్య విద్యార్థినులు



**కాకినాడ, జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో బిసిఏ ఫస్టియర్ విద్యార్థినులు జి.హరి నాగచంద్రిక, జే. చాందిని అత్యంత ప్రతిష్టాత్మకమైన రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిప్ లు సాధించారు. వీరికి సంవత్సరానికి రూ.50వేలు చొప్పున మూడు సంవత్సరాలు వస్తాయని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రోత్సాహం కల్పించాలనే లక్ష్యంతో రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిప్ను సాధించడం ఎంతో గౌరవప్రదమైన విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డి. బ్యూలా తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ స్కాలర్షిప్ కి ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ కళాశాలలో అమలు చేస్తున్న నాణ్యమైన బోధనా విధానాలు, మోనిటరింగ్ వ్యవస్థ, నిరంతర అకడమిక్ మద్దతు వల్లే విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్షిప్ లు సాధించగలుగుతున్నారన్నారు. విద్యార్థులను కేవలం పరీక్షలకే పరిమితం చేయకుండా, భవిష్యత్ లో వృత్తి అవకాశాలు, పోటీ పరీక్షలు స్కాలర్షిప్ లపై కూడా మార్గనిర్దేశం చేస్తున్నామని, రానున్న కాలంలో మరిన్ని ప్రతిష్టాత్మకమైన స్కాలర్షిప్ లు సాధించేలా ప్రోత్సహిస్తామని, ఎంపికైన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారు విద్యారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి కళాశాలకు, మంచి గుర్తింపు తీసుకు రావాలన్నారు. కళాశాల సెక్రటరీ నల్లమిల్లి సుగుణ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యక్తిత్వ వికాసంలో కూడా ముందడుగులు వేయాలని ఆకాంక్షంచారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్. శేషారెడ్డి మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి కాకుండా సమాజ నిర్మాణానికి కూడా కీలకమని, ఇలాంటి స్కాలర్షిప్ లు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉన్నత లక్ష్యలు సాధించే దిశగా ప్రేరణనిస్తాయని, విద్యార్థినులను హృదయపూర్వకంగా అభినందించారు. స్కాలర్షిప్ కు ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. సత్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## ప్రజా ప్రతినిధులైన అధికారులైన ప్రజలకు సేవకులే - ఎంపీపీ గద్దల మల్లయ్య



**విస్సన్నపేట,జనవరి 8 (వార్తాప్రభ) :** అధికారులు పారదర్శకంగా పనిచేయాలని హౌసింగ్ ఉద్యోగుల సమావేశంలో ఎంపీపీ గద్దల మల్లయ్య తెలిపారు. గతంలో నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన బిల్లులు శాంక్షన్ తెచ్చేందుకు జాబితా తయారుచేయాలని ఉద్యోగులు కులమత రాజకీయాలకతీతంగా పనిచేయాలని ప్రజా ప్రతినిధులు అధికారులు ఎవరైనా ప్రజలకు సేవకులేనని ఆయన చెప్పారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని మండలంలో మారుమూల ప్రాంతాల నుండి వచ్చే కార్మిక కర్షక రైతన్నలకు ఓర్పుగా సమాధానం చెప్పాలన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులమైన అధికారులైన ప్రజా సేవే ప్రధాన లక్ష్యమన్నారు. జగనన్న కాలనీకి సంబంధించి అధికారులతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

## వాలీబాల్ పోటీలలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

● విజేతలను అభినందించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు



**కాకినాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం, రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థులలో ఉన్న క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలననే ఉద్దేశంతో ఆదిత్య డిగ్రీ ,పీజీ కళాశాలలో విద్యార్థులకు వాలీబాల్ , బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరిగింది. వాలీబాల్ పోటీలలో సిహెచ్ జగదీష్, పి నాగ సిద్దు, కే శామ్యూల్ రాజు సిహెచ్ శ్రీను, బి.విష్ణు, ఎం. మోహన్ కృష్ణల బృందం విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించగా బ్యాడ్మింటన్ పోటీలలో ఎన్ జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచి డాక్టర్ నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు విద్యా సంస్థల క్రీడా అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్,రోటరాక్ట్ క్లబ్ బృందాన్ని, విజేతలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,డి. అశ్విని,వాలంటీర్లు సాద్విక్,నాని, శైలజ పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన వైసీపీ నేతలు



**విస్సన్నపేట,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామంలో అనారోగ్యంతో ఉన్న వైసీపీ కార్యకర్త పేరా బత్తుల ప్రదీప్ కుటుంబానికి జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి చేతుల మీదుగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి శిరసాని ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి ముంగా జయరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాలేషా లు పాల్గొన్నారు

## రోడ్లు శుభ్రం చేసే కార్మికురాలితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం పై పుస్తక ఆవిష్కరణ



**విశాఖపట్నం,జనవరి 8 (వార్తాప్రభ) :** భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము జీవితం ఆధారంగా రచించిన పుస్తకాన్ని ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ప్రాంగణంలో రోడ్లు శుభ్రం చేసే మహిళా పారిశుధ్య కార్మికురాలు లక్ష్మమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది. ఈ అరుదైన, అర్థవంతమైన కార్యక్రమం సామాజిక సమానత్వం, శ్రమ గౌరవం, సమావేశతకు ప్రతీకగా మారింది. "అగ్ని సరస్సులో వికసించిన కమలం ద్రౌపది ముర్ము" అనే శీర్షికతో ఈ పుస్తకాన్ని విశ్వహిందీ పరిషత్ అధ్యక్షులు, మాజీ ఎంపీ, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ రచించారు. కష్టసాధ్య పరిస్థితుల నుంచి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించిన ద్రౌపది ముర్ము జీవన ప్రయాణాన్ని ఈ శీర్షిక రూపకాత్మకంగా ప్రతిబింబిస్తుంది. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆంధ్రా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉదయం వేళ ఒక చెట్టు కింద నిర్వహించబడటం విశేషం. సంప్రదాయాలకు భిన్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికురాలితో పుస్తకాన్ని ఆవిష్కరింపజేయడం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరి శ్రమకు గౌరవం ఇవ్వాలన్న సందేశాన్ని రచయిత స్పష్టంగా చాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం మహిళలకు, గిరిజనులకు, అణగారిన వర్గాలకు గొప్ప ప్రేరణ అని అన్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిని పుస్తక ఆవిష్కరణకు ఆహ్వానించడం ఉద్దేశపూర్వక నిర్ణయమని, అది ద్రౌపది ముర్ము ప్రతినిధ్యం వహించే వినయం, పట్టుదల, శ్రమ పట్ల గౌరవం వంటి విలువలకు అద్దం పడుతుందని తెలిపారు."అత్యంత కఠిన పరిస్థితుల నుంచే మహోన్నతమైన వ్యక్తిత్వాలు రూపుదిద్దుకుంటాయి. ద్రౌపది ముర్ము జీవితం కేవలం రాజకీయ ప్రయాణం కాదు, అది మానవీయ విలువల ప్రతిరూపం," అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని వేములపల్లి విద్యాసాగర్కు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారు ఇది హృదయాన్ని తాకే, ఆలోచింపజేసే వేడుకగా అభివర్ణించారు. సాదాసీదా విధానంలో నిర్వహించిన ఈ పుస్తక ఆవిష్కరణ, నిజమైన ప్రజాస్వామ్యం అనేది సాధారణ కార్మికుల గౌరవాన్ని గుర్తించడంలోనే ప్రారంభమవుతుందన్న బలమైన సామాజిక సందేశాన్ని అందించిందని వారు వ్యాఖ్యానించారు.

## పంచాయతీరాజ్ వింగ్ అసెంబ్లీ అధ్యక్షునిగా గజ్జెల రాజీవ్



**పెడన,జనవరి 8 (వార్తాప్రభ) :** నియోజకవర్గంలో వైసిపి నాయకులకు వివిధ అనుబంధ విభాగాలకు సంబంధించి పార్టీ పదవులను కేటాయించారు. నియోజకవర్గం ఇంచార్జి ఉప్పాల రాము సూచన మేరకు పార్టీ హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగానికి అధ్యక్షునిగా గజ్జల రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. పెడన మండలం చోడవరం గ్రామానికి చెందిన రాజీవ్ భార్య చోడవరం గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఉన్నారు. గతంలో ఆయన తండ్రి తల్లి కూడా సర్పంచ్ లుగా వ్యవహరించారు. ఉప్పాల రాముకి సన్నిహితుడు. రాజీవ్ నియామకం పట్ల పలువురు హర్షం ప్రకటించారు

## ఆర్టీసీ కార్గో సర్వీస్ పై అవగాహన ర్యాలీ..



**గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీసుల ప్రచార మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ పై ప్రజల్లో అవగాహన కలిగించేలా పట్టణ వీధుల్లో ఆర్టీసీ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సునీల్ కుమార్ ర్యాలీను ప్రారంభించారు. ఉద్యోగులతో కలిసి ర్యాలీలో అధికారులు పాల్గొన్నారు. డిసెంబర్ 20 తేదీ నుండి ఈనెల 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్గో సర్వీసుల డోర్ డెలివరీ సర్వీస్ ల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సునీల్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని 84 ప్రముఖ పట్టణాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర ప్రైవేటు సంస్థ కంటే ఆర్టీసీలో తక్కువ ధరకు, వేగవంతమైన సేవలను అందిస్తున్నామన్నారు. గుడివాడ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న నమ్మకమైన కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సునీల్ విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ!!

**క్యాష్ ప్రైజ్, సర్టిఫికెట్స్ గెలుచుకున్న గౌట్ స్టూడెంట్స్**
**అభినందించిన కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు**



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 8 (వార్తాప్రభ ప్రతినిధి)** పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ (మంథని), శ్రీ సత్య సాయి సేవా సమితి (గోదావరిఖని) వారు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా డిసెంబర్ నెల 28వ తేదీ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి క్యాష్ ప్రైజ్, ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు గెలుచుకున్న నేపథ్యంలో గురువారం కళాశాలలో ప్రిన్సిపల్, లెక్చరర్లు అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆట భువనేశ్వరి, శాంతి ప్రియ, దుర్గం మహేశ్వరి, కట్కూరి వైశాలిలను ప్రోత్సహించే విధంగా సభ కొనసాగినది. ఈ కార్యక్రమంలో కిషన్, సాంబశివరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో 60 మంది విద్యార్థులు ఎంపిక







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి) సుజాతానగర్, వేపలగడ్డ గ్రామంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు గ్రాండ్ గురు కంపెనీ వారు నిర్వహించినటువంటి జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు,సెక్రటరీ అండ్ కరెస్పాండ్ చావా లక్ష్మనారాయణ , హెచ్ఆర్ లు అర్పితా, బ్యాల రత్నకుమారి లతో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని దానిలో భాగంగానే జాబ్ మేళా నిర్వహించినట్లు వారు తెలిపారు.జాబ్ మేళా నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంత యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.ఎంపికైన వారికి మూడు నెలలు ప్రొబిషన్ పిరియడ్ ఉంటుందని అనంతరం ఆరు లక్షల ప్యాకేజ్ ఉంటుందని తెలిపారు.జాబ్ మేళాలో 250మంది విద్యార్థులు పాల్గొనగా గ్రూప్ డిస్కషన్ ,ఇంటర్వ్యూ, టెక్నికల్ స్కిల్స్ ఆధారంగా 60 మందిని విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.తమ కళాశాల నందు రానున్న రోజుల్లో క్యాంపస్ ప్లేస్మెంట్స్ ద్వారా మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య, బాబురావు, లక్పతి, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ శ్రీనివాస్ ,హెచ్ ఓ డి లు మునీర్, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, రవికిరణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు

# నిషేధిత మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసి, విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**కూకట్ పల్లి, జనవరి8(వార్తాప్రభ):**బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎం.డీ.ఎం.ఏ. నిషేధిత మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 11.34 గ్రాముల ఎం.డీ.ఎం.ఏ, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కూనా రాజు చందు (22), ఎస్.నంజప్ప (32) గా గుర్తించారు. ఈ క్రమంలో గోవాకు చెందిన ఇనావో ఫైజా, బెంగళూరుకు చెందిన యశ్వంత్‌లు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈనెల 5న ఏ1 మాదకద్రవ్యాలు సేవిస్తున్న గంప శ్రీహర్ష (31)ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 1.24 గ్రాముల ఎం.డీ.ఎం.ఏ. స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ అన్నారు. ఇతను ఇచ్చిన సమాచారం మేరకు నిందితులను అరెస్ట్ చేసి మత్తు ద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బాలానగర్ ఎస్.ఓ.టి, బాచుపల్లి పోలీసులతో కలిసి ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఏసీపీ రవికిరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

# సీలింగ్ భూములు హాంపట్

- నిషేధిత జాబితాలో ఉంచినా యథేచ్ఛగా ప్లాట్లు చేసి విక్రయాలు
- రియల్టర్లకు అధికారుల మద్దతు
- అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు
- కలెక్టరేట్ దగ్గర ఉండటంతో ఈ ప్లాట్లకు ఫుల్ డిమాండ్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి) పాల్వంచ, భూమిలేని నిరుపేదల కోసం పూర్వం ప్రభుత్వం పంపిణీ చేసిన సీలింగ్ భూములు ప్రస్తుతం రియల్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అసలైన యజమానులకు ముట్టజెప్పి వాటిని అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. భూమిలేని నిరుపేదల కోసం పూర్వం ప్రభుత్వం పంపిణీ చేసిన సీలింగ్ భూములు ప్రస్తుతం రియల్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. యజమానులకు ఎంతోకొంత ముట్టజెప్పి వాటిని దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం సీలింగ్ యాక్ట్ కింద పొందిన భూమిని సదరు రైతులు క్రయవిక్రయాలు చేయడానికి వీల్లేదు. అలాగే దాన్ని వాణిజ్య అవసరాలకు వాడుకోవడానికి కూడా అవకాశం లేదు. సీలింగ్ భూముల విషయంలో క్రయవిక్రయాలు చేయరాదని చట్టం ఉన్నా అధికారులు దానికి తూట్లు పొడుస్తుండటంతో కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజక వర్గంలోని పాల్వంచ మండల మంచికంటినగర్ లోని సీలింగ్ భూములు చాలా ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. గతంలో సంస్థానాల పరిధిలో ఉన్న భూములను సీలింగ్ యాక్ట్ వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎక్కువ భూమి ఉన్నవారి నుంచి తీసుకొని భూమిలేని నిరుపేదలకు పంచింది. కొన్నాళ్లపాటు ఆ భూముల్లోనే సదరు పేద రైతులు భూములు సాగుచేసుకొని జీవనం సాగించారు. అయితే ఈ సీలింగ్ భూములున్న ప్రాంతానికి కూతవేటు దూరంలో కలెక్టరేట్ ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలోని భూములకు ఎనలేని డిమాండ్ వచ్చింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఉన్న అధికారుల పూర్తి సహకారం కూడా అక్రమార్కులకు ఉండటంతో కాసులపంట పండుతోంది. నచ్చిన ధరల్లో స్థలాలను విక్రయించి దగ్గరుండి మరీ నిర్మాణం చేసి పెడుతున్నారు..ఇంత జరుగుతున్నా కూడ సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం వెనుక కారణాలు ఏంటనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

# భక్తిని చాటుకున్న మాజీ కార్పోరేటర్!!

- మైసమ్మ ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లాలి
- అంగరంగ వైభవంగా గ్రామ దేవతల కొలువు
- పెద్దెల్లి తేజస్విని ప్రకాష్





**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 8 (వార్తాప్రభ ప్రతినిధి)**భక్తిని చాటుకున్నరు మాజీ కార్పోరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాష్. ఈ మేరకు గురువారం రామగుండం నగర పాలక సంస్థ పాత 11వ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ రహదారిపై మైసమ్మ గుడి ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొలువు చేపట్టారు. సొంత ఖర్చులతో మైసమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించిన నాయకులు తేజస్విని ప్రకాష్ దంపతులను డివిజన్ ప్రజలు కొనియాడారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం మాజీ కార్పోరేటర్ మాట్లాడుతూ.....మైసమ్మ ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లాలి అని ఆకాంక్షంచారు. గ్రామదేవతల ఆశీస్సులతో మరోసారి డివిజన్ ప్రజలకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని వేడుకున్నారు. ఎప్పటిలాగే ప్రజలు మెచ్చిన పాలన అందిస్తూ, డివిజన్ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న పెద్దెల్లి దంపతులకే మరోసారి జై అని ప్రజలు శుభాకాంక్షలు తెలపడం కొస మెరుపు.

# ఘనంగా శ్రీగిరి సుధాకర్ జన్మదిన వేడుకలు





**కూకట్ పల్లి, జనవరి8(వార్తాప్రభ):**తెలంగాణ ఉద్యమకారులు, ప్రముఖ రాజకీయ,వ్యాపారవేత్త శ్రీగిరి సుధాకర్ రావు పుట్టినరోజును పురస్కరించుకొని అభిమానులు, శ్రేయోభిలాషులు,నాయకులు, కాలనీ వాసుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.సుధాకర్ రావు పుట్టినరోజు సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు,తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్, శేర్లింగంపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు అరేక పూడి గాంధీలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వీధి అధ్యక్షులు జే.పురేందర్ రెడ్డి, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు కాశి యాదవ్,సీనియర్ జర్నలిస్ట్ నరసింహ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయండి

- జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపు
- జగద్గిరిగుట్టలో గోడపత్రిక ఆవిష్కరణ
- ఈ నెల 18న జరగనున్న పార్టీ శతాబ్ది ఉత్సవాల భారీ సభ




**జగద్గిరిగుట్ట, జనవరి 8, (వార్తాప్రభ) :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నెల 18వ తేదీన ఖమ్మం పట్టణంలో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపునిచ్చారు. గురువారం జగద్గిరిగుట్ట చౌరస్తాలో సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ, నాటి బ్రిటిష్ పాలకుల కుట్రలకు భయపడకుండా దేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసిందని గుర్తుచేశారు. “దున్నేవానికే భూమి”, “ఇండ్లు లేని వారికి ఇండ్ల పట్టాలు” వంటి నినాదాలతో సామాన్యుడి పక్షన నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆయన కొనియాడారు. నేడు రాజకీయాల్లో డబ్బు, మద్యం పెరిగిపోయిన వేళ.. నిఖార్సైన ప్రజా పోరాటాలకు ఎర్రజెండానే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. ఖమ్మంలో జరగబోయే ఈ ప్రతిష్టాత్మక సభకు ఐదు లక్షల మంది కార్యకర్తలు హాజరవుతున్నారని, కుత్బుల్లాపూర్ మండలం నుండి వందలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఉచిత విద్యా, వైద్యం మరియు ఉపాధి హక్కుల సాధన కోసం ఈ సభ దిక్సూచిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె. స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, సీనియర్ నాయకులు సి. వెంకటేష్, దుర్గయ్య, శాఖ కార్యదర్శులు సహదేవ రెడ్డి, వెంకటేష్, నాయకులు ఇమామ్, సామిల్ నరసయ్య, నర్సింలు, జానకి రాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# టి.సి.సి.క్లబ్ మెన్జొటెక్ అండ్‌సింబాస్టిక్ సంయుక్త వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ




**శేరిలింగంపల్లి,జనవరి 8 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సెంట్రల్ పార్క్ లో గల టీసీసీ క్లబ్ మెన్జొటెక్ మరియు సింబాస్టెక్ సంయుక్త వేడుక అయిన మెసస్ ఉ 10 ఇయర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో చైర్మన్ అరిగెల నాగేశ్వర్ రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మెన్జొటెక్ మరియు సింబాస్టెక్ సంయుక్త వేడుక అయిన మెసస్ ఉ 10 ఇయర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగం కావడం నిజంగా ఆనందం మరియు గౌరవం గా ఉంది.ఇలాంటి మైలురాళ్ళు రాత్రికి రాత్రే సాధించబడవు.. అవి సంవత్సరాల దృక్పథం, క్రమశిక్షణ మరియు స్థిరమైన కృషి ద్వారా నిర్మించబడ్డాయి.నేటి డైనమిక్ మరియు పోటీ వాతావరణంలో పది సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేయడం నాయకత్వం, బృందం మరియు ఈ సంస్థలను నడిపించే విలువల గురించి చాలా మాట్లాడుతుంది. ఈ వేడుకను మరింత అర్ధవంతంగా చేసేది ఏమిటంటే ఇది వ్యాపారంలో వృద్ధి గురించి మాత్రమే కాదు, ప్రజల పెరుగుదల గురించి.ప్రతిభ సేవల నుండి సాంకేతిక వేదికల వరకు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల నుండి ఆరోగ్య సంరక్షణ మరియు ఆవిష్కరణ–ఆధారిత చొరవల వరకు మెసస్ అభివృద్ధి చెందిన విధానం నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకుందని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ అద్భుతమైన సందర్భంలో భాగం కావడానికి నన్ను ఆహ్వానించినందుకు మరోసారి ధన్యవాదాలు.మొత్తం మెసస్ కుటుంబానికి నా శుభాకాంక్షలు అని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గిరీష్,తనిజ ,అనురాగ్,యాదగిరి,నాయకులు చాంద్ పాషా మరియు తదితరులు పాల్గొన్నారు.

## వార్తా ప్రభ

# హైదరాబాద్

# ఐ.ఎల్.పి.ఎ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా కామేష్ నియామకం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)కొత్తగూడెం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా కొత్తగూడెం పట్టణానికి చెందిన న్యాయవాది యెర్రా కామేష్ ను ఐ.ఎల్.పి.ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జే.శాంసన్ నియమించారు.ఈసందర్భంగా కామేష్ మాట్లాడు తూ న్యాయవాదుల హక్కులు,న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన,సామాజిక,ఆర్థిక సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కాకుండా,న్యాయవాదులకు 365 రోజులు ఉచితంగా ఆన్లైన్ లో జూనియర్ సివిల్ జడ్జి,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న న్యాయవాదులకు శిక్షణ అందిస్తున్న ఏకైక న్యాయవాద సంస్థ ఐ.ఎల్.పి.ఏ నిలుస్తుందని,మహాత్మా జ్యోతిబా పూలే,డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని ఆదర్శంగా చేసుకొని సమానత్వం ,సమన్యాయం ,సామాజిక సాధికారత కోసం పాటు పడతామని,ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ను జిల్లాలో బలోపేతం చేయుటకు కృషి చేస్తానని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి ప్రతీ ఒక్కరికీ రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించడమే కాకుండా పూలే అంబేద్కర్ గారి ఆలోచనా విధానం,వారి భావజాలం పట్ల అవగాహన కల్పిస్తామని, మరియు చట్టాలు,హక్కుల పట్ల అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.ఐ.ఎల్.పి.ఏ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా నియమితులైన యెర్రా కామేష్ ను న్యాయవాదులు జే.గోపికృష్ణ, భానుప్రియసాదిక్ పాషా,అంబటి రమేష్,ఎర్రపాటి కృష్ణ,మారపాక రమేష్ కుమార్,సమంత్ తదితరులు అభినందించారు.

# విద్యా, నైపుణ్యం “జి.ఈ.ఎం.” లక్ష్యం!!

**సోషల్ రెస్పాన్సిబిలిటీ ఎన్టీపిసి ధ్యేయం**
**సమాజ సేవా కార్యక్రమాలు కంపెనీ మిషన్**
**ఎన్టీపిసి డిఎంఎస్ ప్రెసిడెంట్ రాఖి సమంత**



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 8 (వార్తాప్రభ ప్రతినిధి)** విద్యా, నైపుణ్యం జి.ఈ.ఎం.(గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్) లక్ష్యం అని ఎన్టీపిసి డిఎంఎస్(దీప్తి మహిళా సమితి) ప్రెసిడెంట్ రాఖీ సమంత అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఈడీసీ హాల్లో గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ శీతాకాల వేడుక ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జెమ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సమంత మాట్లాడుతూ......... సోషల్ రెస్పాన్సిబిలిటీ ఎన్టీపిసి ధ్యేయం అని తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాలు కంపెనీ మిషన్ అని అన్నారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఏటా వివిధ కార్యక్రమాలను కంపెనీ నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు.

# ఘనంగా బీఆర్ఎస్ యువ నాయకుడు సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



**కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట జనవరి 8, (వార్తాప్రభ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అంజయ్య నగర్ ‘ఎ’ బ్లాక్ యూత్ నాయకుడు జిఎస్. సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సందీప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని ఆయన కార్యాలయంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సందీప్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు సందీప్‌కు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, సందీప్ కుమార్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షంచారు. ఈ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు నాని, భీమ్రావు, రవి, సాయి, సుగుణాకర్ మరియు అంజయ్య నగర్ యూత్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు..

## సత్య భారతి పాఠశాలలో సాంప్రదాయ సంక్రాంతి.

**మచిలీపట్నం జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భావితరాలకు భారతీయ సంస్కృతిని, తెలుగు పండుగల విశిష్టతను చాటి చెప్పేలా మచిలీపట్టణం –పెడన హైవే నందు ఉన్న సత్య భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణమంతా పల్లెటూరి వాతావరణాన్ని తలపిస్తూ, రంగురంగుల ముగ్గులు, తోరణాలతో కళకళలాడింది. వైభవంగా చిన్న పిల్లలకు భోగి పళ్ళు వేసి ఆశీర్వాదించడం , భోగి మంటలు – గంగిరెద్దుల కోలాహలంతో సందడి జరిగినది .ఈ కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సాంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. అనంతరం హరిదాసుల కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అందరినీ అలరించాయి.

**పోటీల్లో పోటెత్తిన ఉత్సాహం:** ఈ సందర్భంగా విద్యార్థులకు,తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు.?ముగ్గుల పోటీలు: విద్యార్థినులు వేసిన రంగురంగుల రంగవల్లికలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. సాంప్రదాయ దుస్తుల ప్రదర్శన: తెలుగువారి కట్టు–బొట్టు ప్రతిబింబించేలా విద్యార్థులు ధరించిన ధోవతులు, పరికిణీలు పండుగ శోభను రెట్టింపు చేశాయి.



**ముఖ్య అతిథి ప్రసంగం:** ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చికలపూడి సబ్ఇన్స్పెక్టర్ వేమన చందాన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలకు మన మూలాలను గుర్తు చేయాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. ఇలాంటి వేడుకల వల్ల పిల్లల్లో ఐకమత్యం, సంస్కృతి పట్ల గౌరవం పెరుగుతాయని పేర్కొన్నారు. ?పాఠశాల ప్రిన్సిపాల్ బి. నాగలక్ష్మ మాట్లాడుతూ.. విద్యతో పాటు విలువలను నేర్పించడమే తమ లక్ష్యమని, ఈ వేడుకను విజయవంతం చేసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు,తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి కి ముత్యాల హారతి



**విజయవాడ పశ్చిమ జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం ధనుర్మాస పురస్కరించుకొని దేవాలయంలో పంచముఖ ఆంజనేయ స్వామి వారికి సీతారామ లక్ష్మణ దాస ఆంజనేయ స్వామి వారికి భక్తులచే ముత్యాల హారతి మరియు తిరుప్పావై భక్తి కీర్తనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది స్వామి వారి యొక్క కృపా కటాక్షలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం అర్చకులు చింతలపూడి సుబ్రహ్మణ్యం, పవన్ కుమార్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం కమిటీ వారిచే జరిగినది

## నిత్యవసర సరుకులు అందించిన జివిఆర్



**విస్సన్నపేట జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో పుట్రెల గ్రామంలో గ్యాస్ బండ పగిలి ప్రాణహాని లేకుండా బయటపడిన కొలిక పోగు శ్రీనివాసరావు, ఏలియా కుటుంబాలకు మండల టిడిపి కోశాధికారి జివిఆర్ నిత్యవసర సరుకులు అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

## ఎక్సైజ్ శాఖ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న మద్యం దుకాణాలు

**చల్లపల్లి: అవనిగడ్డ: జనవరి 8 (వార్తాప్రభ ప్రతినిధి)** బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే.అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ ఇచ్చిన ఆదేశాలను మద్యం దుకాణాల నిర్వాహకులు నిర్భయంగా బేఖాతరు చేస్తుండటం చర్చనీయాంశం అవుతుంది.ఒక్కోమద్యం దుకాణానికి పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు సిండికేట్ గా ఏర్పడి అక్రమ దందా నిర్వహించడం బహిరంగ రహస్యమే ! బెల్ట్ దుకాణాల్లో తలెత్తుతున్న సమస్యలపై ప్రజలు ముఖ్యంగా మహిళలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లో ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

## నేడు కొండపల్లి లో ప్రజా దర్బార్



**ఇబ్రహీంపట్నం, జనవరి 08(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం.అందులో భాగంగా శుక్రవారం నాడు కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు.ఈ ప్రజా దర్బార్లో ప్రజలు తమకు సంబంధించిన సమస్యలను అర్జీ రూపంలో, దానికి తోడు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు ఫోన్ నంబర్ జతచేసి స్పష్టంగా సమస్యను తెలియపరచాలి. ప్రజల నుండి నేరుగా వినిపించే సమస్యలను పరిశీలించి, తక్షణ పరిష్కార దిశగా చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.

## శీలం లేని చదువు వ్యర్థం.....సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య.

### మత్తు పదార్థాల పై అవగాహన సదస్సు

**మచిలీపట్నం జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యక్తిత్వం లేని వారు ఎంత ఉన్నత చదువులు చదివినా వ్యర్థమేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యములో జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా గురువారం డ్రగ్స్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల కు బానిస అయిన వారు తమ మీద పట్టు కోల్పోతారని, చివరకు వాటిని తీసుకునేందుకు ఎలాంటి అఘాయిత్యానికైన తెగబడతారన్నారు. ఇటువంటి విషయాల్లో భాగస్వాములైతే చట్ట పరిధిలో శిక్షర్హులేనన్నారు. డీఎస్పీ చిట్టిబాబు మాట్లాడుతూ జీవితం లో కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకూడదన్నారు. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదురైన సంఘటనలు నుండి బయటపడి ఉన్నతోద్యోగం సాధించిన తీరును వివరించారు. ఉపకులపతి ఆచార్య కె. రాంజీ మాట్లాడుతూ యువత దేశానికి గొప్ప ఆస్తి అన్నారు. చైనా అనూహ్య రీతిలో అభివృద్ధి చెందడం లో అక్కడ యువతే కీలక పాత్ర పోషించారన్నారు.ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, సీనియర్ న్యాయవాది ముసలయ్య తదితరులు



ప్రసంగించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. శేషా రెడ్డి, డా. శాంతి కృపా, డా. రవి, డా. గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తులు ఇబ్బంది పడుతున్నారు

- సెల్ ఫోన్ టవర్ల ఏర్పాట్లపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోండి
- టెలికం, అటవీ శాఖ అధికారులను కలిసిన శ్రీ కాటమ రాజు, గంగాభవాని దేవస్థాన కమిటీ

**మార్కాపురం, జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత సంచార నిగం లిమిటెడ్ మార్కాపురం సబ్ డివిజనల్ టెలికం అధికారి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ చైర్మన్ మరియు సభ్యులు సన్మానించారు. కాటమరాజు దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సెల్ఫోన్ టవర్ లేని కారణంగా వస్తున్నటువంటి ఇబ్బందులను గురించి సబ్ డివిజనల్ టెలిఫోన్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తో గతంలో చర్చించి వినతి పత్రాన్ని అందించడం జరిగింది. దానికి అనుగుణంగా స్పందించినటు వంటి వారు ఇచ్చినటువంటి సూచనల మేరకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మ గంగరాజు ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు ద్వారా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. వారి ద్వారా గుంటూరు పార్లమెంటు సభ్యులు కేంద్ర గ్రామీణ మరియు టెలికం శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కి వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు ఏరిక్షన్ బాబు పట్టు వదలకుండా ఇద్దరు ఎంపీల తో తరచూ మాట్లాడుతూ ,కాటమరాజు ఆలయానికి వచ్చేటువంటి భక్తుల యొక్క సౌకర్యార్థం అత్యవసర పరిస్థితుల్లో ఎదుర్కొంటున్నటు వంటి పరిస్థితులన్నీ వారికి వివరించడంతో నిన్న మార్కాపురం టెలికం అధికారులకు ఆ ప్రాంత పరిశీలన చేయవలసిందిగా ఢిల్లీ నుంచి ఆదేశాలు వచ్చాయని కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ ,ఆలయ కమిటీ ముఖ్య బాధ్యులు పి ఎల్ పి యాదవ్ తెలియజేశారు. ఆ సందర్భంగా ఈరోజు స్థానిక భారత సంచార్ నిగం లిమిటెడ్ కార్యాలయంలో ఉన్నటువంటి సబ్ డివిజనల్ టెలిఫోన్ అధికారిని కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేయడం జరిగింది. అనంతరం మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారిని కలిసి టెలికం అధికారుల నుంచి ఢిల్లీ నుంచి వచ్చినటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలను మన వినతి పత్రంతో జతపరిచి అందజేయడం జరిగింది. త్వరలో ఫారెస్ట్ ,రెవిన్యూ అధికారుల యొక్క సమన్వయంతో జాయింట్ సర్వే చేయాల్సినటువంటి పరిస్థితులు ఉన్నాయని ,అందుకు సంబంధించి




పెద్దారవీడు తాసిల్దార్ కార్యాలయం ద్వారా కొంత రికార్డును సేకరించామని ఆర్ఎస్ఆర్ రిపోర్ట్ లలో సంపూర్ణమైనటువంటి సమాచారం లేని కారణంగా తాడేపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని సంప్రదించి సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి రికార్డు కోసం దరఖాస్తు చేశామని ఇరువురు నాయకులు ఇరువురు తెలియపరిచారు. సంబంధిత రెవెన్యూ రికార్డులు అన్నిటిని కూడా సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన తర్వాత రెవెన్యూ డిపార్ట్మెంట్ వారితోనూ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారితోను కలిసి విన్నవించి సర్వేలు నిర్వహించడం ద్వారా కాటమరాజు దేవస్థానం యొక్క భూమి కొలతలు తీసుకుని తమ ఆలయం యొక్క సరిహద్దులను నిర్ణయించుకుంటామని వారు తెలియజేశారు. టెలికం బి ఎస్ ఎన్ ఎల్ ,ఫారెస్ట్ అధికారులను కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ రియల్ ఎస్టేట్, ఉపాధ్యక్షులు అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి గోసు వెంకట సుబ్బారావు యాదవ్, ఆలయ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు తాళ్ల అల్లూరి కుమార్ యాదవ్ ఉన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 177 మంది వ్యక్తులకు జరిమానా విధించిన న్యాయస్థానం

**విజయవాడ పశ్చిమ జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి.శ్రీమతి షిరీన్ బేగం పర్యవేక్షణలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ నేపధ్యంలో గురువారం 1వ, 6వ, ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 177 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఏడవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి ఆర్.వి.ఎస్.శర్మ మొత్తం 177 మందికి ఒక్కొక్కరికిరూ.10,000/– చొప్పున రూ.17,70,000/– జరిమానా విధించారు.ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షతంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. తెలియజేశారు.ఈ 177 కేసులలో 107 కేసులు వన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోవి.



## గొడవర్రులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు / పెనమలూరు జనవరి (వార్తా ప్రభ, ప్రతినిధి)**పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో నూతనంగా రోడ్డు నిర్మాణానికి 80లక్షల నిధులు మంజూరు చేసి ఈ రోజు శంకుస్థాపన చేయడం సంతోషకరం అన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు.కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, నూతన రోడ్లు నిర్మించడం కొరకు కోట్లాది రూపాయల నిధులు సమీకరణ చేయడం జరిగిందన్న ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ , పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా 200 కోట్ల మేర ప్రణాళికల్లో భాగంగా గొడవర్రు గ్రామంలో ప్రస్తుతం 80 లక్షలు నిధులతో నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మరలా 1 కోటి 32 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణాన్ని పెంచేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు,తదితరులు, పాల్గొన్నారు.

## కోడలిపై కత్తితో దాడి చేసిన మామ.



**మచిలీపట్నం జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో దారుణం చోటు చేసుకుంది. కోడలిపై మామ దాడి తీవ్ర కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం మచిలీపట్నం పరాసుపేట కు చెందిన ఎన్జీవో నేత ఆకూరి శ్వేత వలంద పాలెం కు చెందిన వెంకన్న అనే వ్యక్తితో కొంతకాలం క్రితం వివాహం జరిగింది. ఇరువురి మధ్య కలహాలు రావడంతో కొంతకాలం నుండి భర్తకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. దీనితో భార్యాభర్తల మధ్యనే కాక ఇరువురు కుటుంబాల మధ్య విభేదాలు తలెత్తాయి. మామ సోమరాజు బుధవారం రాత్రి పరాసుపేట ఆంజనేయ స్వామి టెంపుల్ ఎదుట ఓ మెడికల్ షాప్ దగ్గర ఉన్న శ్వేతా పై కత్తితో హత్యాయత్నానికి ప్రయత్నించాడు. సోమరాజు తనతో పాటు తెచ్చుకున్న కత్తితో శ్వేత ను తుద ముట్టించేందుకు పన్నాగం తో కత్తితో తలపై దాడి చేశాడు. శ్వేత చెయ్యి అడ్డు పెట్టుకోవడంతో చెయ్యికు, తలపై బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థలంలో స్థానికులతో పాటు ఈగల్ డిపార్ట్మెంట్ కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ శ్వేతా మామ సోమరాజును అడ్డుకున్నారు. దీనితో స్థానికులు సోమరాజును పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు చెత్తగాత్రురాలను చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు గాయాలకు కుట్లు వేసి చికిత్స అందించారు. నిందితుడుపై మచిలీపట్నం చిలకలపూడి పోలీస్ స్టేషన్లో అత్యాయత్నం నేరంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్టల్ సేవింగ్స్ పథకాల పాంప్లెట్ విడుదల



**మచిలీపట్నం జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో జనవరి 1 నుండి 24వ వరకు పోస్టల్ సేవింగ్ ఖాతాల ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజనల్ పోస్టల్ సూపర్డెంట్ బి శ్రీనివాసరావు పాల్గొని పోస్టల్ సేవింగ్ పథకాలు వడ్డీ రేట్లపై రూపొందించిన పోస్టల్ పాంప్లెట్ లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ పోస్టల్ సేవింగ్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజలలో సురక్షతమైన పొదుపు మార్గాలను ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పోస్టల్ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## కెయూలో సంక్రాంతి వేడుకలు

### అలరించిన సంక్రాంతి సంబరాలు

### ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



**మచిలీపట్నం జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు పంచెలు, విద్యార్థినులు చీరలు ధరించి వేడుకల్లో పాల్గొనడం తో పండుగ శోభ ఉట్టిపడింది. ఈ సందర్భంగా రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ను దేశం లోని పలు రాష్ట్రాల్లో పలు పేర్లతో ఉత్సాహంగా చేసుకుంటారన్నారు. కొత్త పంటను ఇంటికి తీసుకుని వచ్చే సందర్భమే సంక్రాంతి పండుగ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన రంగవల్లులు అలరించాయి. అనంతరం సంక్రాంతి పాటలతో చేసిన నృత్యాలు ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతి డా. సుజాత, సహాయ ఆచార్యులు డా. అనిల్, డా.పుష్పలత, డా. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సహకార సంఘ ఉద్యోగుల రిలే దీక్షలు



**ఇబ్రహీంపట్నం, జనవరి 8 (వార్తా ప్రభ ప్రతినిధి):** సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ జేఏసీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం బ్రాంచ్ వద్ద రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ జీవో నెంబర్ 36ను అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో జేఏసీ పిలుపు మేరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు, దాములూరు పీఏసీఎస్ సీఈవో కె.సతీష్, కొటికలపూడి, ఈలప్రోలు, ఇబ్రహీంపట్నం, మూలపాడు, గుంటుపల్లి సీఈవోలు డి.వేణు, కె.పవన్ కుమార్, పి.రవికుమార్, ఎ.లక్ష్మ, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి ప్రయాణాలు చేస్తున్నారా? జాగ్రత్త.. దొంగతనాల నివారణకు జీడిమెట్ల పోలీసుల వినూత్న ప్రచారం

### ఆటోల ద్వారా కాలనీల్లో మైకులతో అవగాహన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడిమెట్ల ఎస్హెచ్ఓ గడ్డం మల్లేష్ విజ్ఞప్తి

**కుత్బుల్లాపూర్/జీడిమెట్ల, జనవరి 8, (వార్తాప్రభ)** :సంక్రాంతి పండుగ వేళ ప్రజలు తమ సొంత ఊళ్లకు వెళ్లే సమయంలో ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు విరుచుకుపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, దొంగతనాలను అరికట్టేందుకు జీడిమెట్ల ఎస్హెచ్ఓ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. **ఆటోల ద్వారా ప్రచారం - ప్రజల్లో చైతన్యం:**జీడిమెట్ల పోలీసులు ఒక ప్రత్యేక ఆటోను ఏర్పాటు చేసి, దానిపై పబ్లిక్ అడ్రస్ సిస్టం (మైకులు) అమర్చి ప్రతి కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఊళ్లకు వెళ్లే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తున్నారు.



**పోలీసులు సూచిస్తున్న ప్రధాన జాగ్రత్తలు:** 1. తాళాల భద్రత: ఇంటికి తాళాలు వేసేటప్పుడు అవి సరిగ్గా ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. 2. విలువైన వస్తువులు: బంగారం, వెండి ఆభరణాలు మరియు నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలి. 3. సమాచారం అందించండి: మీరు ఊరికి వెళ్తున్నప్పుడు ఆ సమాచారాన్ని సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా ఇరుగుపొరుగు వారికి గానీ తెలియజేయాలి. 4. అనుమానాస్పద కదలికలు: మీ వీధిలో లేదా కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

**రాత్రివేళ నిఘా పెంపు:**పండుగ సెలవుల్లో చోరీలను అరికట్టేందుకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట గస్తీని పెంచామని ఎస్హెచ్ఓ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచామని, ప్రజలు పోలీసులకు సహకరించి దొంగతనాలను అరికట్టాలని ఆయన కోరారు.

## సంక్రాంతికి ఊరు వెళ్లే వాళ్ళు ఇంట్లో ఖరీదైన వస్తువులు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

### -ఏసీపి రవి కిరణ్ రెడ్డి.




**కూకట్ పల్లి, జనవరి8(వార్తాప్రభ):** రాబోయే సంక్రాంతి పండుగకు పురస్కరించుకొని ప్రజలందరూ జాగ్రత్త వహించాలని కూకట్ పల్లి ఏసిపి రవి కిరణ్ రెడ్డి సూచించారు. కూకట్ పల్లి, కేపి.హెచ్.బి పరిసర ప్రాంతాలలో 75 శాతం పైగా నివసించే ఆంధ్ర ప్రాంత వాసులు వారి సొంతూర్లకు వెళ్తారని దీనికి అనుగుణంగా వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో నగదు బంగారం వెండి ఆభరణాలు పెట్టకుండా ఉండాలని అన్నారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో సైతం ఊరుకు వెళ్తున్నట్లు తెలియజేస్తే అక్కడ ఎక్కువ శాతం పెట్రోలింగ్ నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. నేర నియంత్రణ కోసం తమ యంత్రాంగాన్ని సైతం సిద్ధం చేశామని ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని అన్నారు. ప్రజలు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని అదేవిధంగా ఇతరులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు.

## మండలంలో జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

### - కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు...



**కృత్తివెన్ను జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలం శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యం అని తెలియజేసిన ఎస్ ఐ పైడి బాబు కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్, ఆదేశాల మేరకు మచిలీపట్నం డి.ఎస్.పి సిహెచ్ రాజా పర్యవేక్షణలో పెడన ఇన్స్పెక్టర్ కె నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కృత్తివెన్ను మండలంలో కోడిపందాలు, పేకాట గుండు ఆట జోదం వంటి చట్ట విరుద్ధమైన క్రీడలు నిర్వహించిన యెడల వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా శాంతియుతంగా సుఖ సంతోషాలతో ప్రజలందరూ కలిసి జరుపుకోవాలని అవగాహన కార్యక్రమాలను కృత్తివెన్ను మండలం మొత్తం నిర్వహించిన ఎస్సై ఏ పైడి బాబు గారు కోడిపందాలు పేకాట వంటి చట్టపరమైన చర్యల వలన జరిగే అనర్థాలను వివరిస్తూ ప్రధాన కోడలు ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేయడమైనది ఎవరైనా కోడిపందాలు పేకాట గుండాట మొదలైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గోపవరం బీసీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు





**నూజివీడు:జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగు సంస్కృతికి అద్దంపట్టే సంక్రాంతి పండుగను గోపవరం బీసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి మన తెలుగువారి సంస్కృతి , సంప్రదాయానికి నిదర్శనమని గోపవరం బీసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు అన్నారు. ఉదయం భోగి మంటలతో ప్రారంభమైన ఈ పండుగ సంక్రాంతి విశేషాలను తెలియజేసే రకరకాల కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించడం జరిగినది. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించడం జరిగినది. పాఠశాల తల్లులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని రకరకాల, రంగురంగుల రంగవల్లులను పాఠశాలలో వేశారు. హరిదాసుని సంకీర్తనలు, గంగిరెద్దుల ఆటపాటలతో ఎంతో ఆనందంగా ఈ కార్యక్రమం కొనసాగింది. పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులు ఎస్ఎంసి సభ్యులు మరియు సచివాల సిబ్బంది భోగి పండ్లను పోసి ఆశీర్వదించారు. విద్యార్థులు రకరకాల గాలిపటాలను తయారుచేసి ఉత్సాహంగా వాటిని ఎగరవేసి ఆనందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని దాసరి ఝూన్సీ, ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## సెయింట్ థమస్ హైస్కూల్ లో రహదారి భద్రత వారోత్సవాలు

**నూజివీడు. జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు పట్టణంలోని సెయింట్ థమస్ హైస్కూల్ లో 37వ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా " శిక్షణతో భద్రత – సాంకేతికత ద్వారా పరివర్తన " అనే స్లోగన్ తో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఈరోజు కార్యక్రమంలో భాగంగా సెయింట్ థమస్ హై స్కూల్ ఆవరణలో విద్యార్థులకు రోడ్డు భద్రత మాస ఉత్సవాల గురించి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్, బ్రదర్ కిషోర్ బాబు, స్పెషల్ డైరెక్టర్ బ్రదర్ జాన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రోడ్డు భద్రత కార్యక్రమం ఉద్దేశించి పిల్లలకు రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ నిబంధనకు అనుగుణంగా వారు సూచించిన సైన్ బోర్డు లను గమనిస్తూ భద్రత విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ఈ రోడ్డు భద్రత విషయాలను విద్యార్థి దశ నుంచి తెలుసుకొనటం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని, భావితరాలకు ప్రమాదరహిత రోడ్లుగా చూడవచ్చని ఇది మన అందరి బాధ్యతగా రహదారి భద్రత గురించి అవగాహన కలిగి ఉండాలని, సంవత్సరంలో మనం జరుపుకునే ప్రతి పండగ లాగా ఈ




రహదారి భద్రత మాసోత్సవాల పండగ కూడా జరుపుకోవాలన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో మద్యం సేవించరాదని, రవాణా శాఖ ద్వారా జారీ చేసిన లైసెన్స్, వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ పొల్యూషన్ పర్మిట్, అన్ని సక్రమంగా ఉండే విధంగా స్కూల్ యాజమాన్యం పర్యవేక్షించాలని పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులతో పాటు యాజమాన్యం వారు కూడా బాధ్యతాయంగా వారిని గమనిస్తూఉండాలని ఈ భద్రతా కార్యక్రమంలో భాగంగా తెలిపారు.

## శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ వార్ల సంక్రాంతి జాతర మహోత్సవాలకు ఆహ్వానం



**గన్నవరం, జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ రూరల్ మండల పరిధిలోని రామవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ వార్ల సంక్రాంతి జాతర మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జాతరను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం ఆలయ ఈవో పి.ప్రియాంక, చైర్మన్ పట్టపు వెంకటేశ్వరరావు నేతృత్వంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులను మర్యాదపూర్వకంగా కలసి జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామవరప్పాడు టీడీపీ ఆద్యక్షులు నబిగాని కొండా, ధర్మకర్తల మండలి సభ్యులు లక్కంరాజు మల్లికార్జునరాజు, పోతన వెంకట దుర్గానాగేశ్వరరావు, కాకాని శివరామ్, గద్దం ఏడుకొండలు, అడ్డగిరి రజని, వేమినేని కనకదుర్గ, ఇనమాల పార్వతి, మొదిలి సంధ్య టీడీపీ నాయకులు అద్దేపల్లి సాంబ శివ నాగరాజు (సాంబు), కొంగన రవి, కళ్లేపల్లి సాయి తదితరులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి జనార్దన్ రెడ్డి



**కంకిపాడు /పెనమలూరు జనవరి (వార్తా ప్రభ, ప్రతినిధి)**మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో 3.50 కోట్లతో ఉప్పులూరు – ఈడుపుగల్లు రోడ్డు పనులను ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి జనార్దన్ రెడ్డి, నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూపెనమలూరులో సుమారు 16 కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని, 60 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం రోడ్లను రెన్యువల్ చేయలేని పరిస్థితిలో పరిపాలించారని రాష్ట్రంలో 27,000 కిమి. రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఏర్పడినాక నియోజకవర్గ అభివృద్ధికి 60 కోట్ల రూపాయలు కేటాయించారు. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి 40 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచాము మద్దూరు – వణుకూరు రోడ్డుకు 4 కోట్లు, బోల్లపాడు – ముదునూరు రోడ్డుకు 90 లక్షలు నిధులతో పనులు జరుగుతున్నాయి ఏప్రిల్ లోపు నియోజకవర్గంలో ఉన్న ఆర్ అబి రోడ్లు అన్ని అభివృద్ధి చేస్తాం గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వలన పూర్తి భారం కూటమి ప్రభుత్వంపై పడింది రాబోయే రోజుల్లో నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామానికి సిసి, బీటీ రోడ్లు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటిస్తేనే అరికట్టవచ్చు- కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ జనవరి 08 (వార్తా ప్రభ ప్రతినిధి)** రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ఉ1లో నిర్వహించిన "2026 జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు" అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్రదర్శించిన నాటికలు,ఉపన్యాసాలు అందరినీ ఆలోచింపజేశాయి.

## విద్యార్థులకు 'సంకల్పం' కిట్లు పంపిణీ

**చల్లపల్లి:అవనిగడ్డ: జనవరి 8 (వార్తాప్రభ ప్రతినిధి)** వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు చల్లపల్లి తహశీల్దార్ డి.వనజాక్ష సూచించారు. కలెక్టర్ ప్రేరణతో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పుష్పగుచ్ఛాలు, కేకులు తదితరాలకు పెట్టె ఖర్చును వసతి గృహాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించాలన్న మహోన్నత ఆశయంతో రూపుదిద్దుకున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్టడీ టేబుల్స్, అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ దుర్వ్యసనాలకు లోను కాకుండా క్రమశిక్షణ, అంకితభావంతో చదివి సమాజం, తల్లిదండ్రులు గర్వించదగ్గ ఉత్తమ పౌరులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలుర ,బాలికల వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు సంకల్పం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



ఎంపిడిఓ ఎం ఎం ఆనంద కుమారి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఘంటసాల కృష్ణ మోహన్, వార్డెన్ కె.లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు-ఎమ్మెల్యే బోడె



**పెనమలూరు, జనవరి (వార్తా ప్రభ, ప్రతినిధి)** రాష్ట్రంలోనే పెనమలూరు నియోజకవర్గనికి అత్యధిక నిధులు కేటాయించారని విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ, పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పెనమలూరు నియోజకవర్గనికి అత్యధికంగా ఆర్ అండ్ బి నిధులు 60 కోట్లు మంజూరు చేశారన్నారు. కనెక్టింగ్ బ్రిడ్జికి 41 కోట్లు, ఈడుపుగల్లు ఉప్పులూరు మధ్య రోడ్డు అభివృద్ధికి మూడున్నర కోట్లు, దశాబ్ద సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోని మద్దూరు వణుకూరు రోడ్డుకి నాలుగు కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండా ప్రవీణ్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## వాహన డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

**కాకినాడ, జనవరి 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వాహన డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని రవాణా శాఖ అధికారులు పేర్కొన్నారు. 37వ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఐ.టి.ఐ. ఆవరణలో ఆటో,బస్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ శ్రీకాంత్,ఎఎంవిఐ కళాజ్యోతి మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బస్సు డ్రైవర్లు తమ వాహనాలకు ఫిట్నెస్ ఉండేలా చూడాలని, డ్రైవింగు అనుభవంతోపాటు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు,బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.





స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల 20 వ మహాసభలో డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా విచ్చేసిన గౌరవ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ జాతీయ సంక్షమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్,బి.సి. నాయకులు దుగ్గని సూర్య యాదవ్, యర్రాకుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు **వార్తా ప్రభ, విజయవాడ**

## కల్వకుర్తిలో నేడు పలు కీలక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం.

### కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొననున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి.



**ఎల్బీనగర్ / వార్తప్రభ ( జనవరి 8):** కల్వకుర్తి నియోజకవర్గంలో నేడు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి వరుసగా కాలువల నిర్మాణం,నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్లు, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, ప్రధాన రోడ్డు విస్తరణ, షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొనాలని ఎమ్మెల్యే పిఏ శేఖర్ కోరారు.

## నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 8, (వార్తా ప్రభ, ప్రతినిధి)** :ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి అధికారు లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టుమార్టం గది నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో గెలిచిన యాదవ కుటుంబ సభ్యుడు, గాజువాక ఎంఎల్ఏ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు పల్లా శ్రీనివాస్ యాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ మరియు ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కటారి రామ కృష్ణ తదితరులు.

**"వార్తా ప్రభ, విజయవాడ**

# గోపికా గీతం

**(తిరుప్పావై) ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం**

**పాశురాం - 24**



అన్ను ఇవ్వులగమళందాయ్ అడిపోట్రి,
శెన్టంగుత్ తెన్నిలంగై శెట్రాయ్ తిఱల్ పోట్రి,
పొన్ట చ్చగడముదైత్తాయ్ పుగళ్ పోట్రి,
కన్ను కుణిలా వెఱిందాయ్ కళల్ పోట్రి,
కున్ను కుడైయాయ్ ఎడుత్తాయ్ గుణం పోట్రి,
వెన్ను పగై కెడుక్కుం నిన్?కైయిల్ వేల్ పోట్రి,
ఎన్టెన్నున్ శేవగమే యేత్తి ప్పఱై కొళ్వాన్,
ఇన్ను యాం వందోం ఇరందేలోరెంబావాయ్ ?

**భావ వివరణ:**

ఓ యాదవ సాలంబనా! (యాదవులకు ఆధారమైనవాడా!)

నాడు వామనుడవై వచ్చి త్రివిక్రముడై ముల్లోకాలను కొలిచిన నీ ఎర్రని పద్మ పాదాలకు శుభ మంగళం. దక్షిణ దిక్కున ఉన్న లంకాపురిని జయించి, రాక్షసరాజైన రావణుని సంహరించిన నీ భుజ బల పరాక్రమానికి జయ మంగళం. శిశువుగా ఉండి కూడా శకటాసురుని (బండి రూపంలో వచ్చిన రాక్షసుని) కాలితో తన్ని, మట్టి కరిపించిన నీ కీర్తికి శ్రీ మంగళం. లేగదూడ రూపంలో వచ్చిన వత్సాసురుని, వెలగపండు రాలగొట్టే కర్రలా గిరగిరా తిప్పి విసిరికొట్టిన నీ పాద కడియాలకు నిత్య మంగళం. ఇంద్రుని గర్వమణచడానికి, గోవులను మరియు గోపాలకులను కాపాడడానికి గోవర్ధన గిరిని గొడుగులా ఎత్తిన నీ దయా గుణానికి సత్మంగళం. శత్రువులను జయించే నీ చేతిలోని ఆయుధానికి (వెలాయుధానికి) శోభాయమంగళం.

ఈ విధంగా మేము నీ గత కాలపు వీరగాథలను గానం చేస్తూ, నీకు దిష్టి తగలకూడదని 'మంగళాశాసనం' చేయడానికి వచ్చాము. నీ కరుణతో మా కోరికలను నెరవేర్చు, మా యాదవ ఆమోదా! (మాకు ఆనందాన్ని ఇచ్చువాడా).

**పరమార్థం (సందేశం):**

ఈ పాశురం భగవంతుని కీర్తిని, ఆయన దివ్య కార్యాలను స్మరిస్తూ చేసే 'మంగళాశాసనానికి' (శుభం పలకడానికి) అత్యంత ప్రాముఖ్యతనిస్తుంది.

ప్రేమతో కూడిన రక్ష: భగవంతుడు మనల్ని రక్షిస్తాడు అనేది సామాన్య ధర్మం. కానీ, భక్తులకు భగవంతునిపై ఉండే అధికమైన ప్రేమ వల్ల, ఆ స్వామికి ఎక్కడ కీడు జరుగుతుందో అని భయపడి, స్వామికి రక్ష కట్టడమే ఈ పాశురంలోని విశేషం.

అవతార స్మరణ: వామనుడిగా, రాముడిగా, కృష్ణుడిగా ఆయన చేసిన ఘనకార్యాలను తలచుకోవడం ద్వారా భక్తి భావం దృఢపడుతుంది.

దివ్య ఆనందం: భగవంతుని విజయ గాథలను కీర్తించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది.

భక్తుల విన్నపం: "ఓ యాదవ ప్రభూ! మేము మీ విజయాలను స్మరిస్తూ, మీ పాదాలకు మంగళం పాడుతున్నాము. తమ దయతో మమ్మల్ని ఆశీర్వదించి, మా వ్రతానికి కావలసిన పరికరాలను అనుగ్రహించండి."

// ఆండాళ్ తిరువడిగలే శరణం//

**-రచయిత: వై.ఎస్. యాదవ్,**
**చైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.**

# ఘనంగా ఉత్తమ కార్యకర్తల సత్కార కార్యక్రమం

-45మంది ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలతో సత్కరించిన ఎమ్మెల్యే రాము..





**గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక టిడిపి కార్యాలయంలో ఉత్తమ కార్యకర్తల సత్కార కార్యక్రమం గురువారం ఉదయం ఘనంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలో ఎంపికైన 45 మంది ఉత్తమ కార్యకర్తలకు మంత్రి నారా లోకేష్ అభినందనలతో కూడిన ప్రశంసా పత్రాన్ని అందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. శాలువా పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న లేకున్న ప్రజల కోసం పోరాడే కార్యకర్తలు ఉన్న ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనని అన్నారు. నిబద్ధత క్రమశిక్షణ ప్రజల కోసం పోరాడే తత్వాలను అన్న ఎన్టీఆర్, చంద్రబాబు మొదటి నుండి మనందరికీ నేర్పారన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా టిడిపి కార్యకర్తలు ప్రజల తరఫున పోరాడతారని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు. సుపరిపాలనలో కార్యక్రమంలో ఎవరైతే నూరు శాతం పనిచేశారో వారిని పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. మిగిలినవారు మరింత పూర్తితో పనిచేసి మరింత ఎక్కువ మంది గుడివాడ నుండి ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, టిడిపి నాయకులు చేకూరు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, పండ్రాజు సాంబయ్య, కార్పొరేషన్ల డైరెక్టర్లు సాయన పుష్పవతి, మజ్జాడ నాగరాజు, గోకవరపు సునీల్, నియోజకవర్గం లోని పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు టిడిపి అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం కష్టపడే పిఎసిఎస్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం శోచనీయం..

**-4వ రోజుకు చేరిన పిఎసిఎస్ ఉద్యోగుల రిలే నిరహార దీక్షలు**



**గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు చేస్తున్న రిలే నిరహార దీక్షలకు ప్రభుత్వం స్పందించి, తక్షణమే జిఓ నెం 36ను అమలు పరిచి, పెడింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని ఎపి పిఎసిఎస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు టిపిఎస్ హనుమంత రావు లు కోరారు. గురువారం స్థానిక పంచాయితీ రాజ్ కార్యాలయం సమీపంలోని సహకార సంఘ బ్యాంక్ వద్ద ఎపి పిఎసిఎస్ అధ్వర్యంలో 4వ రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, హనుమంతరావు లు మాట్లాడుతూ సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులు రైతుల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. రైతులను అదుకోవడం జరుగుతుందన్నా రు. రైతుల కోసం కష్టపడే వారిని చిన్న చూపు చూడడం దారుణ మన్నారు. కావున తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ రమేష్, ఎం.హరిష్, వై.సుజాత, ఆశా తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

-23 మందికి రూ.19 లక్షల ఆర్థిక సాయం..



**గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** స్థానిక టిడిపి కార్యాలయం -ప్రజా వేదికలో ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 23 బాధితులకు మంజూరైన.. రూ.19 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మీడియాతో మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్సలు చేయించుకునీ కష్టాల్లో ఉన్నవారికి సీఎం సహాయం నిధి పేరుతో అందించే సహాయం ఎంతో చేయూతనందిస్తుందన్నారు. గుడివాడ చరిత్రలో రికార్డు స్థాయిలో కూటమి 19నెలల పాలనలో రూ.4 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి నగదును బాధితులకు అందించామని రాము తెలిపారు. అలాగే గత మోసపూరిత ప్రభుత్వంలో తిరస్కారానికి గురైన వారికి సైతం ముఖ్యమంత్రి సహాయనిధి సహకారాన్ని అందిస్తున్నామని, నేడు పంపిణీ చేసిన 4చెక్కులు ఉన్నాయని చెప్పారు. మనందరి మంచి కోసం పనిచేసే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, సినీ రూరల్ మండలం, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు లు కార్పొరేషన్ల డైరెక్టర్లు సాయన పుష్పవతి, మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు పండ్రాజు సాంబయ్య, కర్రే వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ టీడీపీ కార్యాలయంలో గురువారం కార్యక్రమంలో ఘనంగా జరిగిన ఉత్తమ కార్యకర్త గా సత్కరింపబడి.. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము చేతుల మీదుగా మంత్రి నారా లోకేష్ అభినందనలతో కూడిన ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న టీడీపీ నాయకులు సయ్యద్ జబీన్.. ఈ సందర్భంగా జబీన్‌ను టీడీపీ ఉత్తమ కార్యకర్తగా ఎన్నుకున్నందులకు ఎమ్మెల్యే రాముకు పట్టణ టీడీపీ నాయకులు.. 11వ వార్డు టిడిపి కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలియజేస్తున్నారు..

**-గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :**

# ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానమే పరమౌషదం : స్వామి స్మరణానంద





**తిరుపతి,జనవరి 8 (వార్తాప్రభ) :** ఆధునిక జీవన ఒత్తిళ్లు, ఆందోళనలు అధిగమించేందుకు ధ్యానమే తగు పరిష్కారం అని స్వామి స్మరణానంద స్పష్టం చేశారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక-సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో "క్రియా యోగ ధ్యానం: ఒత్తిడి, ఆందోళనలకు శాశ్వత ఉపశమనం" అనే అంశంపై బుధవారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నా రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు.ఎనలేని ఆనందాన్ని పొందడమే జీవిత లక్ష్యంగా పేర్కొన్న స్వామి స్మరణానంద, అది ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యమని తెలిపారు. ఆనందం కోసం పలు విధాలుగా బయట వెదుకులాడుతున్నామని, అది అంతరంగంలో నిక్షిప్తమై ఉందన్నారు. తైత్తిరీయ ఉపనిషత్తును ఉదహరిస్తూ దైవ స్వరూపం 'సచ్చిదానందం' అని, ఆ స్థితిని ప్రత్యక్షంగా అనుభవించడానికి ధ్యానమే మార్గమని చెప్పారు. ధ్యానం శారీరకఉమానసికఉఆధ్యాత్మిక సమతుల్యతను పెంపొందించి, అంతర్దృష్టిని బలోపేతం చేస్తుందని అన్నారు.పరమహంస యోగానంద బోధనలను ప్రస్తావిస్తూ, నిరంతర సాధన మరియు అంతరంగ నిశ్శబ్దమే ధ్యానానికి పునాదిగా పేర్కొన్నారు. సరస్సులో అలల వలె మనస్సులో ప్రకంపనలు శాంతికి భంగం కలిగిస్తుందని, ధ్యానం ఆ సహజ ప్రశాంతతను పునరుద్ధరిస్తుందని వివరించారు.హంస, ఓం, క్రియ యోగా వంటి ధ్యాన పద్ధతులు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమం ముగింపులో పలువురు క్రియా యోగ ధ్యానం అభ్యసించేందుకై ఆసక్తి కనబరుస్తూ యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ హోమ్‌ఉస్టడీ పాఠ్యాంశాల్లో (తెలుగు, ఇంగ్లీష్) తమ పేర్లు నమోదు చేసుకున్నారు.ప్రసంగం అనంతరం స్వామీజీ శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, నక్షత్ర వనం, నవగ్రహ వనం వీక్షంచారు. పర్యావరణాన్ని పరిరక్షస్తూ ఆహ్లాదభరిత వాతావరణంలో ప్రగతి దిశగా పయనిస్తున్న శ్రీసిటీ అద్భుతంగా ఉందంటూ ప్రశంసించారు.



గుడివాడ -బేతవోలు సైకిల్ షాప్ శౌంఠి శ్రీను కుమార్తె కి సీఎం రిలీఫ్ ఫండ్ అందచేస్తున్న గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్.. ఈ కార్యక్రమంలో బేతవోలు జనసేన నాయకులు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

**-గుడివాడ,జనవరి 8 (వార్తాప్రభ) :**

# నేడు కాకినాడలో తొలి 60కేవీ ఎలక్ట్రిక్ ఛార్జెక్స్ యూనిట్ ప్రారంభం



**కాకినాడ,జనవరి 8 (వార్తాప్రభ) :** నగరంలో తొలిసారిగా విద్యుత్ కార్లకు ఛార్జింగ్ చేసేందుకు 60కేవీ చార్జెక్స్ యూనిట్ ప్రారంభిస్తున్నట్టు ట్రినిటి ఆసుపత్రి డైరెక్టర్ ,చార్జెక్స్ పార్టనర్ రిక్కి, సుదీప గూటం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలో ఇంతవరకు ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఫాస్ట్ ఛార్జింగ్ చేసే యూనిట్ లేదని, ఫాస్ట్ ఎక్స్ ద్వారా అరగంట వ్యవధిలోనే వాహనాలు ఛార్జింగ్ చేసే సదుపాయం ఉందన్నారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 11గంటలకు సిద్ధార్ద నగర్లోని ఐఎంఏ హాలుపక్కనే ఈ యూనిట్ ను గూటం జాషువా ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

# వీరవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో రంగవల్లుల పోటీలు నిర్వహించిన కళ్ళేపల్లి



**హనుమాన్ జంక్షన్,జనవరి 8 (వార్తాప్రభ) :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో లయన్ కళ్లేపల్లి నారాయణరావు,లక్ష్మ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీ. నిర్మల, సీనియర్ జర్నలిస్టు తాడి రంగారావు మొగంటి వెంకటేశ్వర రావు, అంబళ్ళ వెంకట రంగారావు, బి చంద్రశేఖర రావు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. గత 18 సంవత్సరాలుగా వీరవల్లి హైస్కూలు లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళ్ళేపల్లి నారాయణ రావు తెలియజేశారు.ముగ్గుల పోటీ విజేతల వివరాలు ప్రైమరీ విభాగం: ఐదవ తరగతికి చెందిన తన్మయిశ్రీ ,నాలుగవ తరగతికి చెందిన మాన్విత విజేతలుగా నిలిచారు. జూనియర్స్ విభాగం: 6వ తరగతి 'బి' సెక్షన్ నుండి పూర్ణ లిఖిత,7వ తరగతి 'ఎ' సెక్షన్ నుండి కె.నాగ శ్రావ్య ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగం: 10వ తరగతి 'బి' సెక్షన్ విద్యార్థిని జి.ధరణి, 10వ తరగతి 'సి' సెక్షన్ నుండి డి.తేజస్విని విజేతలుగా నిలిచారు. కన్సులేషన్ బహుమతి: 8వ తరగతి 'ఎ' సెక్షన్ కు చెందిన జె.మహతి బహుమతిని అందుకున్నారు. బాలుర విభాగం: 6వ తరగతి 'ఎ' సెక్షన్ నుండి కృష్ణ ప్రసాద్ విజేతగా నిలిచారు.

# కొనసాగుతున్న సహకార సంఘాల ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

**●న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన సిబ్బంది**









**జి.కొండూరు/ మైలవరం,జనవరి 8 (వార్తాప్రభ) :** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ది.వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలకు కొనసాగుతున్నాయి.4వ రోజు గురువారం కూడా ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని దీక్షబూనారు.మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు జి.కొండూరు కేడిసిసి బ్యాంకు ఎదుట డిమాండ్లతో కూడిన ప్ల కార్డులు చేతబట్టి నినాదాలు చేశారు.ప్రభుత్వంపై ఎటువంటి భారం పడని, దీర్ఘకాలం గా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగులు గొంతెత్తి చాటారు.మరోవైపు మైలవరం మండలం లోని 7 సహకార సంఘాల ఉద్యోగులు కేడిసిసి బ్యాంకు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా రు.రిలే నిరాహార దీక్షలలో మండలంలోని మైలవరం, వెల్వడం, తోలుకోడు, చంద్రాల, చంద్రగూడెం, పుల్లూరు, మొర్సుమిల్లి పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సహకార సంఘాల ఉద్యోగులు ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు:** జి. ఓ నెం. 36 వెంటనే అమలుపరిచి సహకార సంఘాల ఉద్యోగస్థులందరికి ప్రొసిడింగ్స్ ఇచ్చి డి.ఎల్.ఎస్.ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకో వాలి. ఉద్యోగులకు ప్రతి 5 సంవత్సరాలకు వేతన సవరణ చేయవలసి ఉండగా ఇప్పటి వరకు జరగనందున 2019, 2024 తాలుకు పెండింగ్ లో వున్న వేతన సవరణలు చేయాలని అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలి 2019 తరువాత సంఘాలలో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలి.మార్చి 01, 2019 నుంచి పి.ఏ.సి.ఎస్ లకు హెచ్.ఆర్ పాలసీ అమలు చెయ్యనందున ఆయా పాలక వర్గాలు సంఘాల పని కుంటుపడకుండా ఉండాలని ఉద్యోగులను నియమించారు.ఈ తాత్కాలిక ఉద్యోగులు సొసైటీ వర్క్ లో మరియు కంప్యూ టరీకరణ చేయడంలో అనుభవం సంపాదించా రు.వీరిని కూడా రెగ్యులర్ చెయ్యాలి. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సిలింగ్ విధించి రూ. 2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలి. సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు అమలు పరుచుకోవచ్చని చట్టంలో వున్నది. జి. ఓ నెం. 36 లోను ప్రభుత్వం అనుమతించినందున సహకార సంఘాల ఉద్యోగులందరికి ప్రభుత్వ ఉద్యోగులకు అమలగుచున్న 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయస్సు అమలుపరచాలి. ఉద్యోగులకు రూ. 5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలి.అలాగే ఉద్యోగి సర్వీస్ లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారము లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి రూ. 20 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలి. అనేక సంఘాలలో ఉద్యోగుల జీతాలను డ్యూటు నందు ఉంచడం జరిగింది. కార్మికుడు పనిచేస్తే జీతం చెల్లిస్తారు. ఆ జీతాన్ని తిరిగి కట్టాలి అనే విధానం ఏ డిపార్ట్మెంట్ లోనూ లేదు. అందు వలన ఉద్యోగుల డ్యూటు పద్దులను రద్దు చెయ్యాలి. గత 6 సంవత్సరాలుగా సహకార సంఘాల ద్వారా గ్రామీణ రైతాంగానికి వ్యవసాయ పంటరుణాలు అందడం లేదు గ్రామీణ స్థాయిల లో సన్న చిన్నకారు రైతులు మరియు కౌలుదారులు అప్పు దొరక్క అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని DCCB\T PACS లుఇచ్చే రుణాలను డైరెక్ట్ గా ఇస్తున్నారు. దీని వలన రైతులకు సరైన సమయంలో అప్పు దొరక్క పోవడమే కాకుండా ఆ ఏరియా పి.ఏ.సి.ఎస్ నిర్వీర్యం అయిపోవుచున్నని.ఈ విధానాన్ని మార్పు చేసి అన్నీ సేవలు సహకార సంఘాల ద్వారా రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. రైతులకు ప్రతి సంవత్సరము వారు చెల్లించిన షేరు ధనంపై డివిడెండ్ లేదా కనీసం 6 శాతం వడ్డీ చెల్లించాలని నిబంధన ఉన్నది. అదే విధంగా డిసీసీబీకి సొసైటీలు చెల్లించిన షేరు ధనం 6 శాతంనకు తగ్గకుండా డివిడెండ్ లేదా వడ్డీ సొసైటీలకు చెల్లింపు చేయాలి. దీనిపై ఆర్.సి.ఎస్ వారు సర్క్యులర్ కూడా ఇచ్చారు. ఎస్.ఎల్.ఇ.సి వారు అనేక పర్యాయములు ఆదేశాలు కూడా ఇచ్చారు. అయినను డిసీసీబీ లు ఈ చెల్లింపులు చేసిన దఖలాలు లేవు. వెంటనే దీనిపై చర్య తీసుకొని 2011వ సంవత్సరము నుంచి చెల్లించవలసిన డివిడెండ్ లేదా వడ్డీ చెల్లించి రైతులకు న్యాయం చేయాలి. సహకార సంఘాల సిబ్బందికి బదిలీలు చెయ్యాలని జి.ఓ.నెం.90లో ఉన్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శాసన సభ సాక్షిగా చెప్పియున్నారు.అయితే సంఘాల యూనియన్ బదిలీలకు వ్యతిరేకం కాదు.ఈ బదిలీలు జరగాలంటే డి.ఎల్.ఎస్.ఎఫ్ ను అప్కాబ్, డిసీసీబీ లు, PACS లతో ఏర్పాటు చేసి 3 సంవత్సరాల నిబంధన కాకుండా నిరవధికంగా కొనసాగించి బదిలీలు చెయ్యాలి. Capacity to pay నిభందనలకు సంబంధం లేకుండా ఉద్యోగుల జీతభత్యాలను ఋణాఖీ ద్వారా నిరవధికంగా చెల్లించాలి. ప్రస్తుతం పనిచేస్తున్న Assistant Executives ýñ<' Clerk లను కంప్యూటర్ ఆపరేటర్ సీనియార్టీ ప్రాతిపదికిన జిల్లాలో ఖాళీగా ఉన్న సి.ఇ.ఓ పదవులలో వీరిని భర్తీ చేయాలి. Assistant Executives DLEC ద్వారా రిక్రూట్‌మెంట్ జరగాలి. ఉద్యోగుల మార్పుల చేర్పుల బాధ్యతను ఋజుజ కమిటీ పూర్తిగా బాధ్యత వహించాలి.సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలే కాకుండా రైతుల సమస్యలను కూడా పరిష్కరించి రైతులకు సేవలు అందిస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించి తగిన న్యాయం చెయ్యాలి.ఈ మా డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు అవసరమైతే రైతులతో కలసి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సేవకు ప్రతిరూపం మరణంలోనూ దాతృత్వం



**హనుమాన్ జంక్షన్,జనవరి 8 (వార్తాప్రభ) :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,హనుమాన్ జంక్షన్ కాపు కళ్యాణ మంటపం నిర్మాణ కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు మాస్టర్ బార్య సూర్య నాగమణి బుదవారం మధ్యాహ్నం మరణించారు 2 గంటలకు కన్ను మూశారు. గురువారం ఉదయం అభిమానులు,మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు,కుటుంబ సభ్యులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. మానవత అంటే కోటేశ్వరరావు మాస్టర్ గా ప్రసిద్ధికెక్కారు. ఉపాధ్యాయుడిగా హనుమాన్ జంక్షన్ వచ్చి 45 ఏళ్లు దాటిశీది. రిటైర్ అయిన తరువాత సేవాకార్యక్రమాలకు ఆయన జీవితాన్ని అంకితం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పేరుతో చేసిన సేవా కార్యక్రమాలు ఒక ప్రక్క ఆయన స్వంతంగా గుంభనగా చేసిన సేవాకార్యక్రమాలు లెక్కలేనన్ని,మాస్టారు గా వేలాదిమంది శిష్యులు వారిలో చెప్పలేనంత ప్రేమ, అభిమానం.మాస్టారు ఆశయం ఒక్కటే మరణంలోనూ సేవ చేయాలని తనతో పాటు తన సతీమణి శరీర దానం చేస్తూ గతంలోనే ఏలూరు మెడికల్ కాలేజీకి అంగీకార పత్రాలు అందించారు. ఆమె భౌతిక కాయాన్ని చివరిసారిగా చూసేందుకు కోటేశ్వరరావు మాస్టారు ను పరామర్శించేందుకు ఆయన స్నేహితులు, అభిమానులు, రాజకీయ ప్రముఖులు,మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సభ్యులు తరలివచ్చి నివాళులర్పించి మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో డాక్టర్ దుట్టా రామచంద్రరావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి,ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షులు కందేపు వెంకట సూర్యనారాయణ,కడప కేంద్ర కమిటీ చైర్మన్ రామానుజులరెడ్డి, తాడేపల్లిగూడెం జోన్ చైర్మన్ బంగార్రాజు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు,ఆంధ్ర ప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ గరికపాటి శివ శంకర్,పెదపాడు మండల వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అప్పన కనకదుర్గా ప్రసాద్, మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఎం.డి,పంచకర్ల చక్రవర్తి, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్, అన్నపూర్ణా ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు, వీరమాచినేని నాగయ్య, సి పి ఎం మండల కమిటీ నాయకులు, ఆశాజ్యోతి ,డెఫ్ అండ్ డేమ్ నిర్వాహకులు జనసేన నాయకులు, తెలుగు దేశం పార్టీ నాయకులు, బి జె పి నాయకులు పాల్గొన్నారు.హనుమాన్ జంక్షన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని జరిపించారు.

